సాక్షి అనంతపురం

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



శాస్త్రవేత్తలుగా ఎదగాలి

విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీవైఈఓ శ్రీదేవి ఆకాంక్షించారు.

8లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.4°/16.9°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



ప్రవేశ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా సాగింది. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ, ఏపీ గురుకుల పాఠశాలలో జరిగిన పరీక్షకు 1,199 మంది విద్యార్థులు హాజరైనట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. 9వ తరగతిలో ప్రవేశానికి 1,003 మంది దరఖాస్తు చేసుకోగా, 789 మంది పరీక్షకు హాజరుకాగా, 214 మంది గైర్హాజరయ్యారన్నారు. అలాగే 11వ తరగతిలో ప్రవేశానికి 619 మంది దరఖాస్తు చేసుకోగా, 410 మంది పరీక్షకు హాజరయ్యారని, 209 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

ప్రతిష్టాత్మకంగా 'జగనన్న పాలవెల్లువ'



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నిదియాదేవి

రాప్తాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 'జగనన్న పాలవెల్లువ' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్లు జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో 'జగనన్న పాలవెల్లువ' కార్యక్రమంపై గ్రామ సభ నిర్వహించారు. డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 13, 14 తేదీల్లో 'జగనన్న పాలవెల్లువ' కింద పాల సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. పాలకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. ఈ సమాచారాన్ని పాడి రైతుల మొబైల్‌కు పంపుతామన్నారు. 15 రోజులకోసారి పాడి రైతులకు బిల్లులు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమవుతాయన్నారు. గ్రామాల్లోని మహిళా రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతా వాణి, ఏపీఎం నల్లప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రుని సేవలో 'సుప్రీం' న్యాయమూర్తులు



ఆలయ చరిత్రను తెలుసుకుంటున్న జస్టిస్ వెంకటనారాయణ భట్టి

లేపాక్షి: లేపాక్షి వీరభద్ర స్వామిని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆశానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్.వెంకటనారాయణ భట్టి దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం వేర్వేరుగా ఆలయానికి విచ్చేసిన వీరికి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తొలుత ఆలయానికి విచ్చేసిన జస్టిస్ ఆశానుద్దీన్ అమానుల్లా దుర్గాదేవి, వీరభద్రస్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన జస్టిస్ వెంకటనారాయణ భట్టి ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించారు. గిరిజా కల్యాణం, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, చవితి వినాయకుడి విగ్రహాలు, వేలాడే స్తంభం, నాట్య మంటపం, సీతమ్మ పాదం తదితర వాటిని తిలకించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అనంతరం దుర్గాదేవి, వీరభద్రస్వామికి పూజలు నిర్వహించారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. న్యాయమూర్తుల వెంట జేసీ అభిషేక్ కుమార్ తదితరులున్నారు.

సేవా దృక్పథంతో పనిచేయండి





వేదికపై సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అమానుల్లా, జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు, తదితరులు

- సాంకేతిక పరిజ్ఞానాన్ని వృత్తికి జోడిస్తే సత్ఫలితాలు
- యువ న్యాయవాదులకు సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తుల సూచన
- బీసీఐ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూలో వర్క్‌షాపు
- పలు అంశాలపై అవగాహన కల్పించిన న్యాయమూర్తులు

అనంతపురం: యువ న్యాయవాదులు సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలని సుప్రీం కోర్టు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు హితవు పలికారు. కాలానుగుణంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వృత్తికి జోడిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. జేఎన్‌టీయూ (ఏ)లో శనివారం 'బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' ఆధ్వర్యంలో యువ న్యాయవాదులకు వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆశానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో పాటు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి, జస్టిస్ యు. దుర్గాప్రసాద్, జస్టిస్ కే. శ్రీనివాస రెడ్డి, జస్టిస్ కే. సురేష్ రెడ్డి, డాక్టర్ కే.మన్మథ రావు, జస్టిస్ బి. శ్యామసుందర్ హాజరయ్యారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) వైస్ చైర్మన్ సి. ప్రభాకరన్, మెంబర్ ఏ.రామి రెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, వైస్ చైర్మన్ కే.రామ జోగేశ్వర రావు, అనంతపురం ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి జి.శ్రీనివాస్, అనంతపురం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కే. విశ్వనాథ రెడ్డి, నగర కమిషనర్ మేఘస్వరూప్, జెడ్పీ సీఈఓ నిదియా దేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు పలు అంశాలపై యువ న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి 'సివిల్ ప్రొసీజర్ కోడ్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టు డిస్పోజల్ ఆఫ్ ఇంటర్‌లాక్యుటరి అప్లికేషన్స్' అనే అంశంపై ప్రసంగించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను తాజా కేసులకు అన్వయించే విధానాన్ని వివరించారు. అనంతరం పలువురు న్యాయమూర్తులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులను బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ, బార్ కౌన్సిల్ ఆఫ్ అనంతపురం ఆధ్వర్యంలో గజమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

ఘన స్వాగతం..

సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులను ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ గౌతమి మర్యాదపూర్వకంగాకలిశారు. పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందించి స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.



జస్టిస్ అమానుల్లాకు జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్

నైపుణ్యాలు పెంచుకోవాలి



యువ న్యాయవాదుల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి వర్క్‌షాపులు దోహదపడతాయి. కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. న్యాయవాదులు నైతిక విలువలకు కట్టుబడి ఉండాలి. కోర్టుల్లో న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు వ్యవహరించే తీరును ఆకళింపు చేసుకోవాలి. తీర్పులను నిశితంగా పరిశీలించాలి. సమాజంలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి. – జస్టిస్ శ్రీనివాస రెడ్డి, ఏపీ హైకోర్టు, న్యాయమూర్తి

ఓర్పుతో ఉంటేనే విజయం



న్యాయవాద వృత్తి సవాళ్లతో కూడుకున్నది. న్యాయవాదులు కోర్టుతో పాటు తమ కక్షిదారులకు జవాబుదారీగా ఉండాలి. బాగా కష్టపడుతూ, ఓర్పుగా పని చేస్తుంటేనే విజయం వరిస్తుంది. అఫిడవిట్లను రూపొందించడం, వాదనలకు సిద్ధం కావడానికి పుస్తకాలు, గత డాక్యుమెంట్లను ఎక్కువగా అధ్యయనం చేయాలి.– జస్టిస్ దుర్గాప్రసాదరావు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

వర్క్‌షాపు నిర్వహణ గర్వకారణం..

అనంతపురంలో యువ న్యాయవాదుల కోసం తొలిసారిగా వర్క్‌షాపు నిర్వహిస్తుండడం చాలా ఆనందంగా ఉంది. సదస్సుకు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు హాజరు కావడం గర్వకారణం. యువ న్యాయవాదులకు తమ అనుభవాలను వివరించిన న్యాయమూర్తులకు కృతజ్ఞతలు. హాజరైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. – ఆలూరి రామిరెడ్డి, బీసీఐ సభ్యులు









జస్టిస్ అమానుల్లా దంపతులు, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ పీకే మిశ్రాను సత్కరిస్తున్న బీసీఐ వైస్ చైర్మన్ ప్రభాకరన్, సభ్యుడు రామిరెడ్డి, జడ్జి శ్రీనివాస్, కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్, జెడ్పీ సీఈఓ

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- పరీక్షలు రాయనున్న 15,992 జనరల్, 1,118 మంది ఒకేషనల్ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఈనెల 20 వరకు కొనసాగనున్నాయి. తొలిరోజు జిల్లాలో 55 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 15,992 మంది జనరల్ విద్యార్థులు, 1,118 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరు కానున్నారు. రోజూ రెండు విడతలుగా పరీక్షలు జరుగుతాయి. తొలివిడత ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. 55 కేంద్రాల్లో 32 కేంద్రాలను ప్రైవేట్ కళాశాలల్లో ఏర్పాటు చేశారు. వీటికి ప్రభుత్వ అధ్యాపకులను చీఫ్ సూపరింటెండెంట్లుగా నియమించారు. పరీక్షలు పకడ్బందీగా సాగేలా ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అనుగుణంగా మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ఎగ్జామినర్లందరూ శనివారం రిపోర్ట్ చేసుకున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

ఈ సందర్భంగా ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణనాయక్ మాట్లాడుతూ ప్రాక్టికల్స్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా వసతులు కల్పించామన్నారు. అక్రమాలకు తావు లేకుండా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. తొలిసారిగా ఆన్‌లైన్ విధానంలో మార్కులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీవీఈఓ వెంకటరమణనాయక్

డీఈఓ వరలక్ష్మి బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ గౌతమికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఈఓ వరలక్ష్మి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారిగా బి.వరలక్ష్మి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ముందుగా కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను డీఈఓ వరలక్ష్మి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏడీ కృష్ణయ్య, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్, డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తంబాబు, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది డీఈఓకు స్వాగతం పలికారు. అలాగే, వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్, రాష్ట్ర నాయకులు గోవిందరెడ్డి, రవీంద్రా రెడ్డి, వెంకటరమణప్ప, కృష్ణా నాయక్, రోగప్ప, రామకృష్ణ, గోపాల్, ఓబిరెడ్డి, శివ ప్రసాద్, సిద్ద ప్రసాద్, వెంకటరెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు కలిసి బొకే అందజేశారు. వైఎస్సార్-98 ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డప్ప రెడ్డి, కార్యదర్శి ఏ. వెంకటేశ్వర్లు, గోపాల్ నాయుడు తదితరులు డీఈఓ వరలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంఈఓ-2, ఎస్సీ, ఎస్టీ ఎంఈఓ, ప్రధాన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో డీఈఓకు అభినందనలు తెలిపారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు లింగా నాయక్, ప్రధాన కార్యదర్శి నారపరెడ్డి, రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు గురు ప్రసాద్, రాష్ట్ర ప్రతినిధి రామచంద్ర, కార్యవర్గ సభ్యులు హరికష్ణ,సనోవర్ బాషా, తారా చంద్రనాయక్, వెంకటస్వామి, మల్లికార్జున తదిరులు డీఈఓను కలిశారు. కాగా, అన్నమయ్య జిల్లా రాయచోటి డిప్యూటీ డీఈఓగా పని చేస్తున్న వరలక్ష్మికి డీఈఓగా పదోన్నతి కల్పించి జిల్లాకు బదిలీ చేశారు.

క్లుప్తంగా

నేటి నుంచి పంపనూరులో మాఘమాస ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి మాఘమాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 11వ తేదీన మహా గణపతి మోదుక హోమం, 15న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం, 24న మాఘ పౌర్ణమి విశేష అభిషేకం, మార్చి 3న సూర్య నమస్కారాలతో అరుణ హోమం, 8న మహా శివరాత్రి మహోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఆలయంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలతో పాటు విశేష పూజలు నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రతి ఆదివారం కాలసర్పదోష రాహు కేతు హోమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

వేడి రాజేసిన బీడీ

- వృద్ధుడికి తీవ్రగాయాలు


గాయపడ్డ రామాంజనేయులు

కూడేరు: బీడీ కాల్చే అలవాటు ఆ వృద్ధుడిని చిక్కుల్లోకి నెట్టింది. కాల్చిన బీడీని ఆర్పకుండా పడేయడంతో అది కాస్తా దుప్పటికి అంటుకుని తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ఉదిరిపికొండకు చెందిన రామాంజనేయులు (60) శుక్రవారం రాత్రి భోజనం చేశాక మంచంపై పడుకున్నాడు. శనివారం వేకువజామున మెలకువ రావడంతో లేచాడు. మంచంపై కూర్చునే బీడీ తాగాడు. అనంతరం బీడీ ముక్కను ఆర్పకుండా పడేశాడు. ఆ ముక్క దుప్పటిపై పడిన విషయం గమనించలేదు. నిదానంగా నిప్పు రాజుకుని దుప్పటికి మంటలు వ్యాపించాయి. ఒక్కసారిగా రామాంజనేయులు కేకలు వేశాడు. అప్పటికే అతడి ఛాతీ కుడివైపు భాగం కాలి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో డీవైఈఓ శ్రీదేవి
- రాష్ట్రస్థాయికి ఏడు నమూనాల ఎంపిక

రాప్తాడు: విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా ఉప విద్యాధికారి (డీవైఈఓ) శ్రీదేవి ఆకాంక్షించారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం రాప్తాడు మోడల్ స్కూల్లో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన-2024 నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. శాస్త్ర, సాంకేతిక అంశాలపై విద్యార్థి దశ నుంచే ఆసక్తి కలిగిస్తూ వారి సృజనకు రూపం కల్పించినప్పుడే నూతన ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయన్నారు. ఆ దిశగా సైన్సుఫేర్ నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌కు 106 నమూనాలకు గాను 91 ప్రదర్శించారన్నారు. ఇందులో ఏడు నమూనాలను రాష్ట్ర స్థాయి ప్రదర్శనలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాజెక్టుల విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు స్వరాజ్య, న్యాయ నిర్ణేతలు ప్రసాద్, శ్రీదేవి, రామకృష్ణ, రఘువర్మ, జిల్లా సైన్సు అధికారి బాలమురళి తదితరులు పాల్గొన్నారు.


జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఈ-కేర్ ఫుడ్ స్టోరేజీ నమూనాను పరిశీలిస్తున్న దృశ్యం

ఈ కేర్ ఫుడ్ స్టోరేజ్‌తో ఉపయోగం

పంట ఉత్పత్తులకు సరైన ధరలు లేనపుడు బాధపడాల్సిన పనిలేదు. గిట్టుబాటు ధర వచ్చే వరకు ఈ కేర్ ఫుడ్ స్టోరేజ్‌లో భద్రపరచుకోవాలి. ఈ కేర్ ఫుడ్‌స్టోరేజీలను సోలార్ ద్వారా సెన్సార్ ఉపయోగించి భద్రపరుస్తారు. టెంపరేచర్ వాల్స్, హైజీనిక్ ఉండడం వల్ల పంటలు చెడిపోకుండా తాజాగా ఉంటాయి. ఎప్పుడు గిట్టుబాటు ధర వస్తుందో అప్పుడే పంటలు అమ్ముకోవచ్చు. అర్బన్ కిసాన్ యాప్‌లో తమ పంట వివరాలు, ధర అప్‌లోడ్ చేస్తే.. వినియోగదారులు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయవచ్చు. ఈ విధానం ద్వారా వినియోగదారులకు, రైతుకు న్యాయం జరుగుతుంది.

–చెన్ని (9వ తరగతి), గైడ్ టీచర్ శామ్యూల్ ప్రతాప్
(జెడ్పీ హైస్కూల్, గుత్తి కోట)

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం



నేడు ప్రతి ఒక్కరూ బయట దొరికే జంక్ ఫుడ్ తినడం వల్ల బీపీ, షుగర్, వివిధ రోగాల బారిన పడుతున్నారు. దీంతో వారి ఆయుష్షు తగ్గి పోతోంది. చిరుధాన్యాలు తినడం వల్ల ఆరోగ్యం పెంపొందించుకోవచ్చు. కొర్రలు, ఆరికలు, వరిగలు, సామలు, రాగులు, ఊదలు, జొన్నలు తినడం వల్ల పోషక విలువలు పెరిగి ఆరోగ్యకరంగా ఉంటారు.

–చైత్ర, పదో తరగతి, మోడల్ స్కూల్ రాప్తాడు

లైట్ సెన్సార్‌తో రోడ్డు ప్రమాదాలకు చెక్



రాత్రి పూట ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది మృత్యువాత పడుతున్నారు. వాహనాల లైట్ల హై ఫోకస్ వల్ల ముందు వస్తున్న వాహనాలకు రోడ్డు కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మనం ప్రయాణించే వాహనానికి ముందు వైపు లైట్ సెన్సార్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా మన ముందు వస్తున్న వాహనం లైట్లు లైట్ సెన్సార్ మీద పడగానే మన వాహనం లైట్స్ హై ఫోకస్ వెంటనే తగ్గిపోతాయి. అప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాలకు దారి కనపడుతుంది.. ప్రమాదాలు తగ్గిపోతాయి. అందుకు ప్రతి వాహనానికీ లైట్ సెన్సార్ ఉపయోగిస్తే రాత్రి పూట ప్రమాదాలు అరికట్టవచ్చు.

– మహమ్మద్, 9వ తరగతి, ఎస్‌జేపీ ప్రభుత్వ హైస్కూల్, గుంతకల్లు

పోర్టబుల్ టెంట్‌తో ఎంతో మేలు



సోలార్ మల్టీపర్పస్ పోర్టబుల్ టెంట్ ద్వారా అనేక ప్రయోజనాలున్నాయి. పబ్లిక్ ప్లేస్‌లో తల్లులు చిన్న పిల్లలకు పాలు ఇవ్వాలంటే చాలా ఇబ్బంది పడుతూ ఉంటారు. ఈ టెంట్ ద్వారా తల్లులు తమ పిల్లలకు పాలు హ్యాపీగా ఇవ్వొచ్చు. మనం తినే ఆహార పదార్థాలు, ఇతర వస్తువులను ఈ టెంట్ ద్వారా రక్షించుకోవచ్చు. రాత్రి పూట దేవాలయాల ద్వారా గదులు దొరక్కపోతే ఆరు బయట ఈ టెంట్‌ను వేసుకుని హాయిగా పడుకోవచ్చు. ఈ టెంట్‌కు పైన అనుసంధానించిన సోలార్ సెల్ ద్వారా లోపల ఉన్న ఎల్ఈడీ బల్బులు వెలుగుతాయి. ఫ్యాన్లు కూడా తిరుగుతాయి.

–జ్యోతి (9వ తరగతి– జెడ్పీ హైస్కూల్), నారాయణ (కసాపురం, గుంతకల్లు మండలం)

నగర రూపురేఖలు మార్చేశాం

- రూ.1.98 కోట్ల సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే అనంత


సూర్యనగర్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో, నగరపాలక సంస్థ పాలకవర్గం సమష్టి కృషితో అనంతపురం రూపురేఖలను మార్చేశామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని సూర్యనగర్‌లో రూ.1.98 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును మేయర్ వసీం, కమిషనర్ మేఘస్వరూప్‌తో కలసి ఎమ్మెల్యే అనంత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ గ్రూపు రాజకీయాల కారణంగా నగర అభివృద్ధి కుంటుపడిందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సూర్యనగర్ రోడ్డును అనతి కాలంలోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ రోడ్డు మాత్రమే కాదని, 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను నిర్దేశిత సమయం కంటే ముందుగా నిర్మించి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీర్చామన్నారు. పాతూరు కనకదాస విగ్రహం నుంచి తడకలేరు వరకు జాతీయ రహదారి, శ్రీకంఠం సర్కిల్ నుంచి గుత్తి రోడ్డు, జేఎన్‌టీయూ రోడ్డు, జన్మభూమి రోడ్డు, లక్ష్మీనగర్ రోడ్డు, రామచంద్రనగర్ రోడ్డు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పేదల ప్రాంతాల్లోనూ రోడ్లు

ప్రధాన ప్రాంతాల్లో మాత్రమే కాకుండా పేదలు నివసించే ప్రాంతాల్లోనూ అంతర్గత రోడ్లు నిర్మించామని ఎమ్మెల్యే అనంత తెలిపారు. అంబేడ్కర్ నగర్, ఎస్సీ, కాలనీ ఫెర్రర్ నగర్, తదితర ప్రాంతాల్లో ప్రాధాన్యతా క్రమంలో రోడ్లు వేశామన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ నగరంలో ఊహకందని విధంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేపడుతామన్నారు. కమిషనర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపడుతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు ఆబూసాలేహ, సైఫుల్లాబేగ్, సాకే చంద్రలేఖ, రాజేశ్వరి, ఈశ సూర్యనారాయణ, నాయకులు బండి శ్రీకాంత్, గంగాధర్, సాకే కుళ్లాయస్వామి పాల్గొన్నారు.

శాన్వితను బాగా చూసుకో ప్లీజ్!


మృతుడు రామకృష్ణ (ఫైల్)

తాడిపత్రి: కట్టుకున్న భార్యను, కన్నకూతురును హత్య చేసిన ఉన్మాది చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబంలో మిగిలిన పెద్ద కుమార్తె శాన్వితను బాగా చూసుకో అత్తా అని కాలిపై పెన్నుతో రాసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. యాడికి మండల కేంద్రంలో నివాసముంటున్న రామకృష్ణ (30) అప్పులు చేసి క్రికెట్ బెట్టింగ్ ఆడేవాడు. అయితే బెట్టింగ్‌లో అతడికి తీవ్ర నష్టాలే వచ్చాయి. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. డబ్బు కోసం భార్య కుటుంబ సభ్యులపై ఒత్తిడి తీసుకొచ్చేవాడు. బెట్టింగ్ మానుకోవాలని భార్య చంద్రావతి చెప్పినా వినలేదు. రోజూ ఈ విషయంలో దంపతుల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈ నెల ఎనిమిదో తేదీన భార్య చంద్రావతి, చిన్నకుమార్తె చైత్రికను ఊపిరాడకుండా చేసి చంపేశాడు. తర్వాత ఇంటి నుంచి పరారయ్యాడు. ఈ విషయం 9వ తేదీ వెలుగులోకి వచ్చింది. పోలీసులు అతడి కోసం గాలింపు చేపట్టారు. తను చేసిన ఘోరమైన చర్యకు పశ్చాత్తాపం పడ్డాడో.. లేక ముఖం చూపించలేక భయపడ్డాడో తెలీదు కానీ శనివారం తాడిపత్రి మండలం పెద్దపొలమడ రైల్వే లెవెల్ క్రాసింగ్ సమీపంలో రైలుకిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రైల్వే జీఆర్పీ ఎస్ఐ నాగప్ప సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ఆస్పత్రికి తరలించారు. మృతుడు తన కాలిపై 'అత్తా.. నీ కుమార్తెను కాపాడుకోలేకపోయాను. నా పెద్ద కుమార్తె శాన్వితను బాగా చూసుకో ప్లీజ్' అని పెన్నుతో రాసుకున్నాడు. 'శాన్విత నిన్ను ఒంటరిని చేసి వెళ్లిపోతున్నా' అని కూడా రాసుకున్నాడు.

నేడు అశ్వత్థం తిరునాల ప్రారంభం

- చాగల్లు నుంచి దిగువపెన్నాకు నీరు విడుదల


చాగల్లు నుంచి నీరు విడుదల చేసిన దృశ్యం

పెద్దపప్పూరు: మాఘమాసం సందర్భంగా చిన్నపప్పూరు సమీపంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అశ్వత్థంలో ఆదివారం తిరునాలు ప్రారంభం కానున్నాయి. అశ్వత్థ నారాయణస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలాచరించడం కోసం దిగువ పెన్నాకు శనివారం చాగల్లు ప్రాజెక్టు నుంచి 500 క్యూసెక్కులు నీరు విడుదల చేశారు. తిరునాలలో తొలి ఆదివారం కావడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. పుణ్యస్నానాలాచరించే క్రమంలో నది లోతట్టు ప్రాంతంలోకి చిన్నారులు, దివ్యాంగులు, వృద్ధులు వెళ్లకూడదని హెచ్చెల్సీ డీఈ జయరాజ్, జేఈ హరి హెచ్చరించారు.

అశ్వత్థంలోకి వాహనాలకు నో ఎంట్రీ

అశ్వత్థనారాయణస్వామి స్వామి క్షేత్రంలోకి ఆదివారం తిరునాల సందర్భంగా వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు యాడికి సీఐ రోషన్ తెలిపారు. క్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు తమ వాహనాలను నిర్దేశిత స్థలాల్లో పార్కింగ్ చేయాలన్నారు. 108, 104 వాహనాలు మినహా ఏ వాహనాన్నీ క్షేత్రంలోకి అనుమతించబోమని, భక్తులు పోలీసులకు సహకరించాలని తెలిపారు. నీరు విడుదల చేసిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లోకి ఎవ్వరూ వెళ్లకుండా ముందస్తుగా బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ శరత్‌చంద్ర వెల్లడించారు.

అర్ధరాత్రి దారుణం

- పశుగ్రాసానికి దుండగుల నిప్పు
- మంటల్లో ఎద్దు సజీవ దహనం

కంబదూరు: మండల కేంద్రంలోని గుండ్లపల్లి కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి దారుణం జరిగింది. రైతు ప్రవీణ్‌కుమార్‌కు చెందిన పశుగ్రాసానికి దుండగులు నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అందరూ గాఢ నిద్రలో ఉండటంతో గుర్తించలేకపోయారు. నెమ్మదిగా మంటలు చుట్టుపక్కలకు వ్యాపించడంతో వేడి ధాటికి సమీపంలోని వారు లేచారు. మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. మంటలు చుట్టుముట్టడంతో ఒక ఎద్దు సజీవదహనమైంది. మరొక ఎద్దు తప్పించుకుంది. పది ట్రాక్టర్ల పశుగ్రాసం కాలి బూడిదైపోగా.. సమీపంలోని కోళ్ల షెడ్ పూర్తిగా దెబ్బతింది. దాదాపు రూ.5లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు ప్రవీణ్‌కుమార్ తెలిపాడు. అగ్ని ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రేపటి నుంచి బాలోత్సవం


చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన (ఫైల్)

పండుగ ఎన్ని రోజులు	3
బాలోత్సవం జరిగే తేదీలు	ఈ నెల 12, 13, 14
సమయం	ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు
వేదిక	అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానం
ఉత్సవంలో పాల్గొనే పాఠశాలల సంఖ్య	115
విద్యార్థుల సంఖ్య	4 వేల మందికి పైగా

అనంతపురం కల్చరల్: చదువులు, సామాజిక మాధ్యమాలతో ఒత్తిడికి లోనవుతున్న చిన్నారుల్లో ఆనందోత్సాహాలు నింపే పండుగ 'బాలోత్సవం' వచ్చేసింది. అనంతపురం వేదికగా ఆదివారం నుంచి మూడు రోజులపాటు ఈ ఉత్సవం సాగనుంది. మేధావులు, రచయితలు, కవులు, ఉపాధ్యాయులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానంలో బాలోత్సవం నిర్వహిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా అకడమిక్ (విద్యా సంబంధమైనవి) కల్చరల్ (కళలకు సంబంధించినవి)తో పాటు క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి బహుమతులందిస్తారు. సృజన ఉట్టిపడేలా దేశభక్తుల పేర్లతో వివిధ వేదికలను ఏర్పాటు చేసి అక్కడ శాస్త్రీయ నృత్యాలు, చిత్రలేఖనం, నాటికలు, ఇంగ్లిష్, తెలుగు వార్తారచన, సైన్సు ఎగ్జిబిషన్, ఏకపాత్రాభినయాలు, షార్ట్‌ఫిల్మ్ మేకింగ్, ముఖాభినయం, జానపద, వెస్టన్ సంగీతం, దేశభక్తి గీతాలు, కోలాటం వంటి పోటీలు నిర్వహిస్తారు. బాలోత్సవంలో పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని నిర్వాహకులు కోరుతున్నారు.

సృజనాత్మకతకు పెద్దపీట

చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా బాలోత్సవం సాగుతుంది. ఆటపాటలు, విజ్ఞాన విషయాలు, క్రీడలు, నాటికలు ఇలా అన్ని నైపుణ్యాలను వెలికితీయడానికి ఇది ఎంతగానో ఉపకరిస్తుంది. ప్రభుత్వ అధికారులు కూడా బాగా సహకరిస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పిల్లలను బాలోత్సవంలో పాల్గొనేలా ప్రోత్సహించాలి. అనంతపురంలో బాలోత్సవం నాల్గోసారి కూడా విజయవంతంగా నిర్వహించనున్నాం. ఈసారి మరింత విభిన్నంగా ఉండేలా కార్యక్రమాలు రూపొందించాం.

– షమీమ్ షఫీవుల్లా, చైర్‌పర్సన్, బాలోత్సవం


అంబులెన్స్ ఢీకొని వ్యక్తి మృతి

కళ్యాణదుర్గం రూరల్: అంబులెన్స్ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. శనివారం రాత్రి కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది వద్ద హరిజన శివ (40) తాగిన మత్తులో రోడ్డు దాటుతుండగా అనంతపురం వెళ్తున్న 108 అంబులెన్స్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శివ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐఆర్ వెంటనే ప్రకటించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇంటీరియం రిలీఫ్ (ఐఆర్) వెంటనే ప్రకటించాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు మిట్టా కృష్ణయ్య, ఏఎం గిరిప్రసాద్ కోరారు. శనివారం ఉమ్మడి జిల్లా పీఆర్టీయూ కార్యవర్గ సమావేశం అనంతపురంలో జరిగింది. ముఖ్య అతిథులు మిట్టా కృష్ణయ్య, ఏఎం గిరిప్రసాద్ మాట్లాడుతూ డీఎస్సీ 2024 నోటిఫికేషన్‌లో ఇచ్చిన అప్రెంటిస్‌షిప్ విధానాన్ని తొలిగించాలని కోరారు. 2003కు ముందు నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఓపీఎస్ వర్తింపజేయాలన్నారు. పాఠశాల గ్రాంటు వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.రామకృష్ణారెడ్డి, టి.చంద్రశేఖర్‌రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి.పురుషోత్తంరెడ్డి, జి.తిమ్మారెడ్డి, సీనియర్ నాయకులు ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి, సి.రామకృష్ణారెడ్డి, ఎస్.రజనీకాంత్‌రెడ్డి, సుగణమ్మ, దామోదరరెడ్డి, ఉమామహేష్, రామకృష్ణ, లింగన్న, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువుల రవాణా ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ విజయ్‌భాస్కర్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: మూగజీవాలను హింసించడంతో పాటు ఇద్దరు కూలీల మృతికి కారణమైన పశువుల రవాణా ముఠాను పెద్దవడుగూరు పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ ఆర్.విజయ్‌బాస్కర్‌రెడ్డి, డీఎస్పీ సీఎం.గంగయ్య శనివారం తాడిపత్రి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. హర్యానా రాష్ట్రం పత్వాల్ జిల్లా కోట్ గ్రామానికి చెందిన వహీద్, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని ముస్తఫానగర్‌కు చెందిన మహమ్మద్ ఫిరోజ్ ఖురేషి, రంగారెడ్డి జిల్లా కందుకూరుకు చెందిన మహమ్మద్ అజీముద్దీన్, శ్రీసత్యసాయిజిల్లా హిందూపురానికి చెందిన ఖురేషి టిప్పు, వైఎస్సార్ జిల్లా పులివెందులలోని పురుషోత్తం రెడ్డికి కాలనీకి చెందిన మోపూరి నాగేంద్ర, అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ఇల్లూరుకు చెందిన నల్లప్ప ముఠాగా ఏర్పడ్డారు. పశువులను తక్కువ ధరకు కొని.. ఇతర ప్రాంతాలకు తరలించి ఎక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో ఒడిషా సరిహద్దు ప్రాంతం నుంచి ఆవులు, ఎద్దులను కొనుగోలు చేశారు. అక్కడి నుండి శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట దగ్గర బొలెరో వాహనాల్లో పశువులను ఎక్కించి ఏలూరు జిల్లా హనుమాన్ జంక్షన్‌కు తరలించారు. ఇలా 49 పశువులను జమచేసి శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన కురేషి టప్పుతో ఒప్పందం కుదుర్చుకుని ఈ నెల ఆరో తేదీన కంటైనర్ లారీలో పశువులను ఎక్కించి వాటితో పాటు ఇద్దరు కూలీలను వెంట పంపించారు. కంటైనర్‌లో డ్రైవర్‌తో పాటు మహ్మద్ ఫిరోజ్ ఖురేషి కూడా క్యాబిన్‌లోనే వచ్చాడు. పెద్దవడుగూరు మండలం కాశేపల్లి టోల్ ప్లాజా వద్ద అదుపుతప్పి కంటైనర్ లారీ బోల్తా పడింది. వాహనంలో వచ్చిన కూలీలు అనకాపల్లి జిల్లా నక్కలపల్లి మండలం దేవవరం గ్రామానికి చెందిన ఈశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా జలమూరు మండలం పంగవానిపేటకు చెందిన శ్రీనివాసరావు మృతి చెందారు. 49 పశువుల్లో 36 పశువులు మృత్యువాత పడ్డాయి. ప్రమాదం జరిగిన వెంటనే మిగతా వారు అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్పీ అన్బురాజన్ పశువుల అక్రమ రవాణాను తీవ్రంగా పరిగణించి, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని తాడిపత్రి డీఎస్పీ గంగయ్యను ఆదేశించారు. డీఎస్పీ నేతృత్వంలో యాడికి సీఐ రోషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం గుత్తి మండలం కొత్తపేట వద్ద ఫ్లైఓవర్ సమీపంలో ఆరుగురు నిందితులు వహీద్, మహమ్మద్ ఫిరోజ్ ఖురేషి, మహమ్మద్ అజీముద్దీన్, ఖురేషి టిప్పు, మోపూరి నాగేంద్ర, నల్లప్పను అరెస్టు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. వీరిని మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు.

క్లుప్తంగా

ఆత్మీయ కలయిక.. ఆనందాల వేడుక



ఆత్మీయ కలయికలో పాల్గొన్న విశ్రాంత వ్యవసాయశాఖ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖలో జేడీఏ, డీడీఏ, ఏడీఏలుగా పనిచేసి రిటైర్డ్ అయిన విశ్రాంత అధికారుల ఆత్మీయ కలయిక శనివారం స్థానిక కృషిభవన్‌లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పి.క్రిష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కె.మల్లికార్జున, కోశాధికారి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి 40 మంది వరకూ విశ్రాంత అధికారులు హాజరయ్యారు. మంచి ఆరోగ్యం కోసం వ్యాయామం, ఆసనాలు, ఒత్తిడి అధిగమించే అంశాలపై అవగాహన కల్పించారు. పరస్పరం క్షేమసమచారం, కుటుంబ సభ్యుల, పిల్లల చదువులు, పెళ్లిళ్లు, విశ్రాంత జీవితం గురించి చర్చించుకున్నారు. ప్రతి నెలా మొదటి శనివారం సమావేశం కావాలని నిర్ణయించారు. కార్యక్రమంలో విశ్రాంత అధికారులు హరిశ్చంద్రారెడ్డి, చంద్రమౌళి, ఠాగూర్‌నాయక్, విశ్వనాథ్, గురుమూర్తి, నరసయ్య, ఈశ్వరయ్య, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సంగీత కచేరీ

అనంతపురం కల్చరల్: అమరగాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు 50వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు సంగీత కచేరీ నిర్వహిస్తున్నట్లు సీనియర్ గాయకుడు పాలసముద్రం నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మూడవ రోడ్డులోని ఘంటసాల భవన్‌లో జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చే గాయనీ గాయకులతో ఆ పాత మధురాలాపన ఉంటుందని పేర్కొన్నారు. కళాభిమానులు భారీగా విచ్చేయాలని కోరారు.

సింగంపల్లి తండా కాలనీకి విద్యుత్ సౌకర్యం



సింగంపల్లి తండా కాలనీలో విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని సింగంపల్లి తండాలో రెండు రోజుల క్రితం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో పలువురు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నూతనంగా ఏర్పాటైన కాలనీలో విద్యుత్ సౌకర్యం లేదని గ్రామస్తులు తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు అధికారులకు సూచించారు. శనివారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాలతో విద్యుత్ శాఖ సిబ్బంది సింగంపల్లి తండా కాలనీలో వైర్లు లాగి విద్యుత్ సౌకర్యం కల్పించారు. విద్యుత్ సమస్య పరిష్కారం కావడంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎస్టీ కమిషన్ సభ్యుడు, వడిత్యా శంకర్ నాయక్, సర్పంచ్ వెంకటేష్ నాయక్, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి



ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ చింతకుంట సుశీలమ్మ, చింతకుంట మధు

అనంతపురం కార్పొరేషన్: 39వ డివిజన్ 57వ సచివాలయం సమీపంలో వడ్డే కాలనీలో నగరపాలక సంస్థకు చెందిన కొంత రోడ్డు భాగాన్ని ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని ఆ డివిజన్ కార్పొరేటర్ చింతకుంట సుశీలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతకుంట మధు కోరారు. శనివారం నగరపాలక సంస్థలో కమిషనర్ మేఘ స్వరూప్‌కు ఫిర్యాదు చేశారు. బహుళ అంతస్తులతో (90 సెంట్లు) నిర్మిస్తున్న ఈ నిర్మాణంపై గతంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇది అహుడా పరిధిలో ఉందని, తమకేమీ తెలియదని మాట దాటవేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నెట్టికంటుడి సేవలో బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్

గుంతకల్లు రూరల్: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ చైర్మన్, తమిళనాడు అడ్వకేట్స్ అసోషియేషన్ ప్రసిడెంట్ ఎస్.ప్రభాకరన్ శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అనంతపురంలోని జేఎన్‌టీయూలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఉత్తర్‌ప్రదేశ్ హైకోర్టుకు చెందిన మరో ఇద్దరు జడ్జిలతో కలిసి శనివారం సాయంత్రం కసాపురం దేవస్థానానికి చేరుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి స్వామి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

పార్టీలకతీతంగా సంక్షేమం

- మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించండి
- రెట్టింపు సంక్షేమం, అభివృద్ధి చేపడతాం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి
- 48వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



ఇంటింటా పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య

అనంతపురం కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలు ఉంటేనే లబ్ధిదారులకు పథకాలు అందేవి. అయితే సీఎం వైఎస్ జగనన్న నాయకత్వంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని అందించడం జరిగిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని 48వ డివిజన్‌లోని గౌరవగార్డెన్, ఆర్కే నగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు ఎమ్మెల్యే అందించారు. ప్రతి గడప వద్దకు వెళ్లి ప్రజల బాగు కోసం శ్రమిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో పడ్డ ఇబ్బందులు.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంటి వద్దకే అందుతున్న పాలనను గుర్తు చేసుకోవాలన్నారు.

రూ.2,304 కోట్లతో సంక్షేమం, రూ.1045 కోట్లతో అభివృద్ధి పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో రూ.2,304 కోట్లతో సంక్షేమం, రూ.1,045 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అమ్మఒడి రూ.93.39 కోట్లు, విద్యా దీవెన-వసతి దీవెన రూ.73.59 కోట్లు, వైఎస్సార్ చేయూత రూ.89.98 కోట్లు, వెస్సార్ ఆసరా రూ.77.36 కోట్లు, వైఎస్సార్ పింఛన్ కానుక రూ.403.98 కోట్లు, కాపు నేస్తం రూ.9.77 కోట్లు, ఈబీసీ నేస్తం రూ.11.78 కోట్లు, సున్నావడ్డీ రూ.16.98 కోట్లు, వైఎస్సార్ బీమా రూ.6.06 కోట్లు, సీఎం రిలీఫ్ ఫండ్ రూ.10.04 కోట్లు ఎస్సీ, ఎస్టీల ఫ్రీ కరెంటుకు రూ.5.27 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని వెల్లడించారు. అభివృద్ధికి సంబంధించి రూ.311 కోట్లతో అర్బన్ లింక్ వైడనిగ్, రూ.90 కోట్లతో గుత్తి రోడ్డు, ఎన్ క్యాప్ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.68.72 కోట్లు, నగర పాలక సంస్థ సాధారణ నిధులు రూ.49.50 కోట్లు, రూ.19 కోట్లతో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లు, రూ.41 కోట్లతో రుద్రంపేట పంచాయతీ అభివృద్ధి, రూ.43 కోట్లతో ఏ.నారాయణపురంలో అభివృద్ధి పనులు, రూ.16 కోట్లతో రాజీవ్ కాలనీలో అభివృద్ధి, రూ.21 కోట్లతో అనంతపురం రూరల్‌లో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.

బాబును పంపేందుకు ప్రజలు 'సిద్ధం'

అనంతరం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబును మరోసారి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు ప్రతిపక్ష పార్టీ నాయకుల మాటలు నమ్మే స్థితిలో లేరన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 18న రాప్తాడులో జరిగే ఎన్నికల శంఖారావం సిద్ధం కార్యక్రమానికి సంసిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. సిద్ధం సభను విజయవంతం చేయనున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపర్చేందుకు ప్రజలు సైతం సిద్ధంగా ఉన్నారని తెలపిఆరు. అనంతరం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని కార్పొరేటర్లు మాలపాటి శ్రీనివాసులు, మునిశేఖర్, స్థానిక ప్రజలు శాలువా, మెమొంటోతో సన్మానించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థ నాయక్, రజక కార్పొరేషన్ చైర్మన్ ఎస్ రంగన్న, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ లింగాల శివశంకర్ రెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ జయచంద్ర నాయుడు, పార్టీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, స్థానిక నాయకులు చిన్నపరెడ్డి, నిమ్మల నాగరాజు, ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాలపాటి వెంకటేష్, రవికుమార్ రెడ్డి, పెరవలి ప్రసాద్, పసన్నలక్ష్మి, రంగా, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, టీవీ చంద్రమోహన్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎస్‌ఎస్ సాధిక్, రామయ్య, లక్ష్మీదేవి, ఉష, షమీం, భారతి, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.



48వ వార్డులో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాళ్లు

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

- చిన్నారి లిఖితకు ఉచితంగా గుండె ఆపరేషన్ చేయిస్తానని హామీ



రవాణా ఖర్చుల నిమిత్తం లిఖిత తల్లిదండ్రులకు నగదు అందిస్తున్న నాయకులు

ఆత్మకూరు: అందరితో కలిసి ఆడుతూ పాడుతూ చదువుకుంటున్న ఆ చిన్నారికి భయంకరమైన గుండె జబ్బు వచ్చింది. వైద్యం చేయించేందుకు చిన్నారి తల్లిదండ్రులు దాతల కోసం ఆశ్రయించారు. ఏం చేయాలో తెలియక దిక్కుతోచని పరిస్థితిలో ఉండిపోయిన వీరికి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అండగా నిలిచారు. వివరాలు.. ఆత్మకూరు మండలం వడ్డుపలి గ్రామంలో రామకృష్ణ, రామలక్ష్మమ్మకు నలుగురు నలుగురు ఆడపిల్లలు. ఓ వైపు వ్యవసాయ పనులు చేస్తూ మరోవైపు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మూడవ కూతురు అయిన లిఖితకు గుండె జబ్బు సోకడంతో చాలా ఆస్పత్రుల్లో చూపించారు. ఆపరేషన్‌కు రూ.10 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని తెలియజేశారు. ఈ విషయం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి దృష్టికి చేరడంతో వెంటనే ఎమ్మెల్యే స్పందిచారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బెంగళూరులోని ఓ హాస్పిటల్ నిర్వాహకులతో మాట్లాడి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని భరోసా ఇచ్చారు. ఖర్చుల నిమిత్తం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో శనివారం రాత్రి రూ.20 వేల నగదు అందజేయించారు. తమ బిడ్డ గుండె ఆపరేషన్‌కు సహాయం చేసిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల కన్వీనర్ హరినాథ్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనారాయణ రెడ్డి,జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ ఓబిరెడ్డి పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు మోడల్ పరీక్ష



ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రూపొందించిన ప్రశ్నపత్రం ద్వారా మోడల్ పరీక్ష నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధానకార్యదర్శి ఓతూరు పరమేష్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు, చదువుపై మరింత ఆసక్తి పెంపొందించేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతుందన్నారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థుల ప్రణాళికబద్ధంగా చదవాలన్నారు. ఈ మోడల్ పరీక్షలో టాప్ టెన్‌లో నిలిచిన విద్యార్థులకు ఎస్వీ జూనియర్ కళాశాల స్కాలర్‌షిప్ అవకాశం కల్పిస్తుందన్నారు. ఇంటర్మీడియట్ విద్య బాధ్యత చూసుకుంటుందని కరస్పాండెంట్ ఖాజావలి ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ పి.దస్తగిరి, కే.మల్లికార్జునరావు, ఎం. వలీబాషా, ఎం.మౌనయ్య, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి శివ, ఉపాధ్యక్షుడు సోము, నాయకులు బీమా, మాదేశ్, హరి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల దాష్టీకం



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మత్స్యకార సంఘం సభ్యులు, పార్టీ నాయకులు



నీరు లేకపోవడంతో చెరువులోని చేపలు మృత్యువాత పడిన దృశ్యం

- పేరూరు పెద్దచెరువులో మూడు బోర్లు వేసుకుని నీటిని వాడుకుంటున్న టీడీపీ నేత
- నీరులేక వందలాది చేపల మృత్యువాత

రామగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారు. రైతులు బాగుండాలనే ఉద్దేశంతో చెరువులను కృష్ణా జలాలతో నింపారు. ప్రభుత్వ ఆదేశాలతో ఆయా చెరువుల్లో మత్స్యకారులు చేపలను వదలి జీవనం సాగిస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారు. చెరువుల్లో నీటిని జలచౌర్యం చేయడమే కాక వందలాది చేపలు మృత్యువాత పడటానికి కారకులవుతున్నారు. వివరాలు.. మండలంలోని పేరూరు పెద్దచెరువుకు సమీపంలో ఉన్న కొంత చెరువు భూమిని వరద అనే టీడీపీ సానుభూతిపరుడు ఆక్రమించాడు. ఆ భూమిలో అక్రమంగా మూడు బోర్లు వేసుకుని కొన్నేళ్లుగా నీటిని జలచౌర్యం చేస్తున్నాడు. ప్రస్తుతం ఆ చెరువులో నీరు లేక వందలాది చేపలు మృత్యువాత పడ్డాయి. మాజీమంత్రి పరిటాల సునీత అండచూసుకుని టీడీపీ నాయకులు ఇలాంటి దాష్టీకాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలచౌర్యం చేస్తున్న టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మత్స్యకార సంఘం సభ్యులు రామగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ వెంకటరమణను సంప్రదించగా.. తనకు జరిగిన విషయం తెలియదని సమాధానం ఇచ్చారు. వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, జనార్దన్, మత్స్యకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్ వసూళ్లు వంద శాతం దిశగా..

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ ఫీజు వసూళ్లలో వంద శాతం దిశగా మార్కెట్ కమిటీలు పని చేస్తున్నాయని మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణ చౌదరి శనివారం 'సాక్షి'కి తెలిపారు. జిల్లాలో 9 మార్కెట్ యార్డులు, 15 చెక్‌పోస్టుల ద్వారా ఈ ఏడాది రూ.10.81 కోట్లు లక్ష్యంగా కాగా జనవరి ఆఖరుకు 80 శాతంతో రూ.8.69 కోట్లు వసూలు చేశారన్నారు. శింగనమల కమిటీ ఇప్పటికే రూ.75 లక్షలకు గాను రూ.81.45 లక్షల వసూళ్ల(109 శాతం)తో అగ్రస్థానంలో కొనసాగుతోందన్నారు. అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు రూ.4.10 కోట్లకు గాను రూ.3.68 కోట్ల (90 శాతం)తో రెండో స్థానం సాధించినట్లు తెలిపారు. తాడిపత్రి 85 శాతం, ఉరవకొండ 77, రాప్తాడు 75, రాయదుర్గం 70 శాతం వసూళ్లతో లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. ఆ తర్వాత కళ్యాణదుర్గం 58 శాతం, గుంతకల్లు 50, చిట్టచివరి స్థానంలో 45 శాతం వసూళ్లతో గుత్తి మార్కెట్ కమిటీ కొనసాగుతున్నాయన్నారు. ఫిబ్రవరి, మార్చి నెలాఖరులోపు వంద శాతానికి పైగా లక్ష్యం సాధించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పూర్తిస్థాయిలో నీటి సరఫరాకు చర్యలు



మోటర్ మరమ్మతులను పరిశీలిస్తున్న ఎస్ఈ రామమోహన్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో నగరంలో నెలకొన్న నీటి సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఈ రామమోహన్ రెడ్డి పేర్కొన్నారు. పీఏబీఆర్ డ్యాంలో రెండు 500 హెచ్‌పీ మోటార్లను బెంగళూరులో మరమ్మతు చేయిస్తున్నారు. ఆ పనులను ఎస్ఈ రామమోహన్ రెడ్డి శనివారం పరిశీలించి వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కంపెనీ నిర్వాహకులకు సూచించారు. మోటార్లకు మరమ్మతు చేయించి ఈనెల 13వ తేదీ నాటికి నగరంలో నీటి సరఫరా పూర్వస్థితికి తీసుకొస్తామన్నారు. త్వరలో మరో మోటార్‌ను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.

రేపు వడ్డుపల్లిలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పర్యటన

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పర్యటిస్తున్నట్లు జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో శ్రీకృష్ణ దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేస్తారన్నారు. అనంతరం ఎస్సీ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

మార్కెట్‌లోకి బొలెరో నియో

అనంతపురం సెంట్రల్: స్థానిక ఐఎంఏ హాలులో శనివారం అంబులెన్స్ కోసం ప్రత్యేకంగా బొలెరో నియో ప్లస్ వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశారు. బాధితులను సౌకర్యవంతంగా, వేగంగా తరలించడంలో ఈ వాహనం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంజీబీ మొబైల్స్ సీఈఓ ఆదిత్యమాచాని, సోమనాథ్ మాచాని, బీవీఎస్ చౌదరి, డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ అచ్యుత్‌ప్రసాద్, డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ అభిషేక్, సెక్రటరీ డాక్టర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి శనివారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం 5వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో చేరడానికి ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థినులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. http//mjpapbcwreir.apcfrr.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

210 లీటర్ల డీజిల్ పట్టివేత

గుమ్మఘట్ట: కర్ణాటక నుంచి తరలిస్తున్న 210 లీటర్ల డీజిల్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. వాహన తనిఖీల్లో భాగంగా కేపీ కుంట చెక్‌పోస్టు వద్ద మహమ్మద్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుననట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: పీటీఆర్‌పల్లి ఎగువతండాకు చెందిన కవితాబాయి అనే వివాహిత కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి శనివారం ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు



నమూనాలను తిలకిస్తున్న విద్యార్థులు

బాల ఇంజినీర్లు.. భలే ఆవిష్కరణలు

రాప్తాడు మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో శనివారం జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన-2024 జరిగింది. విద్యార్థులు అబ్బురపరిచే ప్రాజెక్టులను రూపొందించి ఆకట్టుకున్నారు. సామాజిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సరికొత్త ఆవిష్కరణలకు రూపం ఇచ్చారు. ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. - రాప్తాడు:



ప్లాస్టిక్‌తో ఉపయోగపడే వస్తువుల తయారీపై వివరిస్తున్న గుంతకల్లు మండలం ములకలపెంట జెడ్పీ పాఠశాల విద్యార్థినులు తన్మయి, శీరిష



భూసార పరీక్షలపై ప్రాజెక్ట్ తయారు చేసిన గుంతకల్లు మండలం నెలగొండ జెడ్పీ పాఠశాల విద్యార్థి పవన్, గైడ్ టీచర్ మల్లయ్య



ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థి

సమాజాభివృద్ధిలో పాలుపంచుకోండి



సెంట్రల్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ డాక్టర్ వీఎస్ఎస్ శ్రేయను సన్మానించిన దృశ్యం

అనంతపురం: దేశ పురోగతిలో లింగ సమానత్వం ప్రధాన పాత్ర పోషిస్తుందని సెంట్రల్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ డాక్టర్ వీఎస్ఎస్ శ్రేయ అన్నారు. శనివారం అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీఎస్ఎస్ శ్రేయ మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా స్త్రీలు కూడా సమాజాభివృద్ధిలో పాలుపంచుకుంటేనే దేశ పురోగతి సాధ్యమవుతుందన్నారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ నీరజ మాట్లాడుతూ.. మహిళాభ్యుదయంతోనే ప్రపంచ శాంతి, సౌభాగ్యాలు, సుస్థిరాభివృద్ధి సుసాధ్యమని తెలిపారు. అనంతలక్ష్మి కళాశాల చైర్మన్ అనంత రాముడు మాట్లాడుతూ.. ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో ఆ దేశం సుభిక్షంగా ఉంటుందని, స్త్రీలు పురుషులు అనే బేధం లేకుండా ప్రతి ఒక్కరూ సమానమనే భావనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామమూర్తి, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు డాక్టర్ ఎం.సురేంద్ర నాయుడు పాల్గొన్నారు.